క్లుప్తంగా

సినిమా పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే హరీశ్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేటజోన్: శ్రీక్రియేషన్స్ బ్యానర్‌పై రూపొందుతున్న ఓ సినిమా పోస్టర్‌ను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆదివారం ఆవిష్కరించారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆ సినిమా నిర్మాత షరీఫ్, హీరో బాంబే శ్రీనివాస్, కథనాయిక హారికలతో కలసి పోస్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం షూటింగ్ కొనసాగుతున్న ఈ సినిమా ప్రేక్షకుల ఆదరణ పొందాలని ఆకాంక్షించారు.

మేనేజ్‌మెంట్ స్టడీస్‌లో డాక్టరేట్



సందీప్‌రెడ్డి

గజ్వేల్: నియోజకవర్గంలోని మనోహరాబాద్‌కు చెందిన కసిరెడ్డి సందీప్ రెడ్డి తమిళనాడులోని భారతీదాసన్ విశ్వ విద్యాలయం నుంచి డాక్టరేట్ అందుకున్నారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ విభాగంలో 'ఉద్యోగ నిబద్ధత దాని ప్రభావం' అనే అంశంపై అధ్యయనం చేసినందుకు ఈ డాక్టరేట్ పట్టా దక్కింది. డాక్టరేట్ పట్టాను పొందడంతో ఆయన కుటుంబ సభ్యులు, సన్నిహితులు అభినందనలు తెలిపారు.

జాబ్‌మేళాలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అంబదాస్

గజ్వేల్‌రూరల్: విద్యార్థులు తమలోని ప్రతిభను చాటుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రగతి, మంజీరా విద్యాసంస్థల కరస్పాండెంట్ అంబదాస్ ఆకాంక్షించారు. స్థానిక ప్రగతి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఆదివారం నిర్వహించిన జాబ్‌మేళాలో ఎంపికైన ప్రగతి కళాశాలకు చెందిన ఎనిమిది మంది విద్యార్థులను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు తాము ఎంచుకొన్న లక్ష్యం దిశగా అడుగులు వేయాలన్నారు. ఉన్నత స్థానాల్లో నిలిచినపుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మట్టయ్య చౌదరి, ఎంఎస్ఎన్ ఫార్మా ప్రతినిధి శేఖర్, న్యూలాండ్ లాబొరేటరీ ప్రతినిధి మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

గాలివానకు కూలిన చెట్టు

- రాకపోకలకు అంతరాయం
- తొలగించిన పోలీసులు



కూలిన చెట్టును తొలగిస్తున్న పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాలలో ఆదివారం సాయంత్రం కురిసిన గాలివానకు పట్టణ కేంద్రం నుంచి ఆకునూరు వెళ్లే దారిలో ఓ వేపచెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకొన్న స్థానిక పోలీసులు అక్కడి చేరి జేసీబీ సహాయంతో చెట్టును తొలగించారు.

కష్టజీవులకు అండగా ఎర్రజెండా

మద్దూరు(హుస్నాబాద్): కష్టజీవులకు ఎప్పుడు ఏ ఆపద వచ్చినా అండగా ఉండేది ఎర్రజెండా మాత్ర మేనని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ అన్నారు. మండలంలోని సలాఖపూర్‌లో ఆదివారం నిర్వహించిన గ్రామశాఖ మహాసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత 44 కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా విభజించి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా మార్చారని మండిపడ్డారు. అనంతరం గ్రామశాఖ నూతన కమిటీని ఎన్నుకొన్నారు.

పథకాలను అమలయ్యేలా చూడాలి

బెజ్జంకి(సిద్దిపేట): పేద, బడుగు, బలహీన వర్గాల పక్షాన పోరాడేది సీపీఐ పార్టీయేనని ఆ పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. మండలంలోని గూడెం, కల్లెపెల్లి గ్రామాలలో ఆదివారం పార్టీ నూతన కార్యవర్గాలను ఎంపికచేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలను అమలయ్యేలా చూడాలని నాయకులకు సూచించారు. ఆయా కార్యక్రమాలలో గోపాల్‌రెడ్డి, సది, లచ్చయ్య, భిక్షపతి, బుచ్చయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణలో నిర్లక్ష్యం

- మల్లన్న ఆలయ వసతి గదుల్లో మౌలిక సదుపాయాలు కరువు
- భక్తులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని ఆలయ ఉన్నతాధికారులు

కొమురవెల్లి(సిద్దిపేట): కోర్కెలు తీర్చే కొమురవెల్లి మల్లికార్జున స్వామిని ప్రతియేటా సుమారు కోటిమందికి పైగా భక్తులు దర్శించుకుంటారు. దీంతో ఆలయానికి సుమారుగా రూ.20 కోట్ల ఆదాయం సమకూరుతుంది. కానీ వసతి గదులలో మౌలిక సదుపాయాల కల్పనలో ఆలయ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వసతి గదులలో పగిలిన ఫ్లోరింగ్



బెడ్‌షీట్ లేని బెడ్



బాత్‌రూమ్‌లో మగ్గుకు బదులుగా వినియోగిస్తున్న డ్రింక్, వాటర్ బాటిల్స్

సౌకర్యాలు అంతంతే..

ఆలయానికి దాతలు నిర్మించి ఇచ్చిన వసతి గదులు 140 ఉండగా వాటిలో 20 గదులు శిథిలమై పోగా, ఆలయ అవసరాలకు 20 గదులు వినియోగిస్తున్నారు. మిగతా 100 గదులను భక్తులకు అద్దెకు ఇస్తారు. వసతి గదులలో భక్తులు సేదతీరేందుకు కుర్చీలు, ఫ్యాన్, టీపాయ్‌తో గదులు పరిశుభ్రంగా ఉండాలి. కాని ఉద్యోగుల నిర్లక్ష్యంలో పలు గదులలో కుర్చీలు ఉంటే ఫ్యాన్ ఉండదు, ఒక వేళ ఉన్నా అది పనిచేయని పరిస్థితి. దానికి తోడు పలు గదులలో ఫ్లోరింగ్ పగిలిపోయింది, బాత్‌రూంలలో మగ్గులు లేవు. దీంతో భక్తులు కూల్‌డ్రింక్, వాటర్ బాటిల్స్ కట్‌చేసి వాటిని మగ్గులుగా వాడుతున్నారు. భక్తులు గదులు ఖాళీ చేసిన వెంటనే బెడ్‌పై బెడ్‌షీట్స్ మార్చాల్సి ఉంటుంది. బెడ్‌షీట్ వేయకపోవడంతో భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

అధికారులు పర్యవేక్షించాలి

ప్రతియేటా స్వామి బ్రహ్మోత్సవాలకు ముందు వసతి గదులలో శానిటేషన్, ప్లంబింగ్, మౌలిక వసతుల కోసం లక్షలాది రూపాయిలు ఖర్చు చేసినట్టు రికార్డులలో చూపుతున్నారు. కాని దానిలో ఒక్క వంతైనా వాటి నిర్వహణలో శ్రద్ధ పెట్టడంలేదని భక్తులు వాపోతున్నారు. ఆలయ ఉన్నతాధికారులు వసతి గదులను తరుచూ పర్యవేక్షించాలని కోరుతున్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం



ఆలయ వసతి గదులలో మౌలిక వసతుల లేమి ఉండటం వాస్తవమే. ఈ విషయం నా దృష్టికి కూడా వచ్చింది. త్వరలోనే ప్రతి వసతి గదిలోను నాలుగు కుర్చీలు, నూతన బెడ్‌షీట్స్, బకెట్లు, మగ్గులు, టీపాయ్‌లను ఏర్పాటు చేస్తాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చూస్తాం.

– అన్నపూర్ణ, ఈఓ

రోడ్డెక్కిన కిక్కు..

- పర్మిట్ రూములున్నా.. ఫుట్‌పాత్‌పై సిట్టింగ్‌లు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ
- సిద్దిపేట పట్టణంలోని మందుబాబుల ఆగడాలు



రోడ్డుపై నిలిపిన వాహనాలు





ఫుట్‌పాత్‌పై మద్యం సేవిస్తున్న మందుబాబులు

సిద్దిపేటకమాన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగకుండా పర్మిట్ రూములు ఏర్పాటు చేసుకోవాలని దుకాణదారులకు అనుమతులిచ్చారు. కానీ చాలా చోట్ల నిబంధనలు పాటించడం లేదు. రోడ్లు, వైన్స్ షాపుల ఎదుట ఫుట్‌పాత్‌లపై మందుబాబులు సిట్టింగ్‌లు వేస్తున్నారు. జిల్లా కేంద్రం సిద్దిపేట పట్టణంలోని పలు వైన్స్ షాప్‌ల వద్ద పరిస్థితిని 'సాక్షి' పరిశీలించింది. మద్యం దుకాణాలు వద్ద షాపుల ఎదుటే సిట్టింగ్‌లు వేస్తున్నారు. అలాగే అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. దీంతో వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఇతర దుకాణదారులతో మందుబాబులు వాగ్వాదానికి దిగుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కట్టుకాలువను పరిశీలించిన ఎమ్మెల్యే



కాలువను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని పెద్ద చెప్యాలలో అసంపూర్తిగా ఉన్న కట్టుకాలువ పనులను దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. ఇరిగేషన్ అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి కట్టుకాలువ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తోట అంజిరెడ్డి, గ్రామ కమిటీ అధ్యక్షుడు శివ, నాయకులు రవీందర్‌రెడ్డి, స్వామి, రాజేందర్, రైతులు ఉన్నారు.

ఆర్ఎస్ఎస్ కార్యకర్తల దాడి దుర్మార్గం



ర్యాలీలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

- బాధ్యులను కఠినంగా శిక్షించాలి
- దళిత సంఘాల నాయకులు

చేర్యాల(సిద్దిపేట): బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ వంటి పేర్లతో మతోన్మాదులు దళిత యువకుడిపై చేసిన దాడి దుర్మార్గమైన చర్య అని దళిత సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక గాంధీ చౌక్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా దళిత సంఘాల నాయకులు మాట్లాడారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్, భజరంగ్‌దళ్ నేతలు, కార్యకర్తలు దళితులను చిన్నచూపు చూస్తూ గుడిలోకి రానివ్వకుండా దూషిస్తున్న పరిస్థితి నెలకొందన్నారు. మానవత్వాన్ని మరిచి సాటి మనిషిని గుర్తించకుండా గత మంగళవారం మండల పరిధిలోని వేచరేణి శివారు ఎల్లదాసునగర్‌లోని బేడ బుడగ జంగాల యువకుడు అజయ్‌పై దాడి చేయడం దుర్మార్గమని వాపోయారు. ఈ దాడిని సభ్య సమాజం, మేధావులు, ప్రగతిశీల వాదులు ఖండించాలని కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ర్యాలీలో దళిత సంఘాల నాయకులు బాలకిషన్, పరశురాములు, సత్యనారాయణ, రాజేందర్, శేఖర్, దేవదానం, రవీందర్, ప్రశాంత్, రమేశ్, బాల్‌నర్సయ్య, ప్రభాకర్, మల్లేశం, శ్రీనివాస్, ఎల్లయ్య, దయానంద్, భరత్ తదితరులు పాల్గొన్నారు.

సీఐటీయూను గెలిపించండి

గజ్వేల్‌రూరల్: కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటేసి సీఐటీయూను గెలిపించాలని ఆ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఆదివారం గజ్వేల్‌లో రాణే పరిశ్రమ యూనియన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్మికుల హక్కులు, వారి సంక్షేమమే ధ్యేయంగా సీఐటీయూ పోరాడుతుందన్నారు. మే 7న రాణే పరిశ్రమలో జరిగే కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో చుక్క గుర్తుకు ఓటువేసి సీఐటీయూ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, వేణుగోపాల్, స్వామి, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లయ్య, నర్సింహులు, వెంకట్రావ్, రవి కుమార్, రంగారెడ్డి, యాదగిరి, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.3లక్షలతో ధర్మశాల పునర్నిర్మాణం

బెజ్జంకి(సిద్దిపేట): బెజ్జంకి శ్రీలక్ష్మీనర్సింహ స్వామి గుట్టపై ఉన్న ధర్మశాలను రూ.3 లక్షల పునర్నిర్మిస్తామని ఒడ్నాల మల్లవ్వ, హన్మంతు దంపతులు తెలిపారు. బెజ్జంకికి చెందిన వారు వృత్తిరీత్యా మహారాష్ట్రలోని షోలాపూర్‌లో స్థిరపడ్డారు. ఆదివారం వారు ఆలయానికి వచ్చి స్వామిని దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 52 సంవత్సరాల క్రితం తామే ధర్మసత్రం నిర్మించామన్నారు. అది ఇప్పుడు శిథిలావస్థకు చేరడంతో పునర్నిర్మిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా దాతలను ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, పూజారి మధుసూదనాచారి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, ప్రవీణ్, కనుకయ్య, హరీశ్, కేశవులు పాల్గొన్నారు.

ఆదివాసులపై హత్యాకాండ ఆపేయండి

బీఆర్ఎస్ నేత ఎల్లయ్య

సిద్దిపేటరూరల్: ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలపై కేంద్ర ప్రభుత్వం చేస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివేయాలని బీఆర్ఎస్ నారాయణరావుపేట మండల అధ్యక్షుడు కోనయగారి ఎల్లయ్య డిమాండ్ చేశారు. మావోయిస్టుల పేరుతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను నిలిపి వేయాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నారాయణపేట మండల కేంద్రంలో ఆదివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సరిహద్దుల్లో ఉండాల్సిన సైన్యాన్ని దండకారణ్యంలో మోహరించి ఆదివాసీలను చంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విలువైన అటవీ సందపదను, భూములను కార్పొరేట్‌లకు అప్పగించడానికే కేంద్రం ఈ దారుణానికి పాల్పడుతోందని మండిపడ్డారు. ఆదివాసులకు రక్షణగా నిలబడతానని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఛత్తీస్‌గఢ్ బీజేపీ ఎమ్మెల్యేలు గెలిచాక వారిపై మారణకాండకు దిగడం దారుణమని, వెంటనే కేంద్రం మావోయిస్టులతో శాంతి చర్చలు జరిపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బాలకృష్ణ, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఆంజనేయులు, మాజీ ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు స్వప్న ప్రభాకర్, మండల నాయకులు ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల రద్దీ



స్వామి వారి రాజగోపురం ఎదుట భక్తుల సందడి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయం ఆదివారం భక్తులరాకతో రద్దీగా మారింది. ఆలయ పరిసరాలు మల్లన్న నామస్మరణతో మారుమోగాయి. భక్తులు గంగరేణి చెట్టు వద్ద పట్నాలు వేసి, ముడుపులు కట్టి మొక్కులు చెల్లించుకొన్నారు. ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకోవాలి

మల్లన్నదయతో సన్‌రైజర్స్ ప్లే ఆఫ్స్‌కు చేరుకోవాలని బీసీసీఐ, హెచ్ సీఏ పిచ్ క్యూరేటర్ చంద్రశేఖర్ ఆకాంక్షించారు. ఆదివారం ఆయన మల్లికార్జున స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇండియా క్రికెట్ టీమ్ మరిన్ని విజయాలు సాధించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ సురేందర్‌రెడ్డి, ఆలయ ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, సిద్దిపేట క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి కలకుంట్ల మల్లికార్జున్ పాల్గొన్నారు.

ఇన్విటేషన్ కప్ విజేత సిద్దిపేట

ఫైనల్‌లో తమిళనాడుతో హోరాహోరీ



కప్ అందజేస్తున్న సిటిజన్ క్లబ్ ప్రతినిధులు

సిద్దిపేటజోన్: జిల్లా కేంద్రంలోని ఫుట్‌బాల్ మైదానంలో రెండు రోజులుగా జరుగుతున్న ఇన్విటేషన్ ఫుట్‌బాల్ కప్ పోటీల్లో సిద్దిపేట జట్టు గెలిచింది. అండర్14– తమిళనాడు, సిద్దిపేట ఫుట్‌బాల్ క్లబ్‌కు మధ్య ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో హోరాహోరీగా పోరాడిన సిద్దిపేట జట్టు విజేతగా నిలిచింది. 2–0 గోల్స్ తేడాతో తమిళనాడు జట్టును ఓడించింది. ఈ సందర్భంగా తమిళనాడు కోచ్ నూర్ బాషా మాట్లాడుతూ సిద్దిపేట మైదానం అంతర్జాతీయ పోటీలకు అనువుగా ఉందన్నారు. అనంతరం సిటిజన్ క్లబ్ అధ్యక్షుడు రమేశ్, జిల్లా క్రీడలశాఖ మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నవాబ్ అక్బర్ విజేత జట్టుకు బహుమతులు అందజేశారు.



హుస్నాబాద్: సిద్ధార్థ హైస్కూల్‌లో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



చిన్నకోడూరు(సిద్దిపేట): ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

అ'పూర్వ' సమ్మేళనం

హుస్నాబాద్: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాలు ఉత్సాహంగా సాగాయి. స్థానిక సిద్ధార్థ హైస్కూల్‌లో 2000–2001పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం సందడి చేశారు. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ఉల్లాసంగా గడిపారు. అనంతరం తమకు విద్య బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సురేందర్‌రెడ్డి, సత్యం, భాస్కర్ రెడ్డి, రమేశ్, రాజ్‌మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నకోడూరులో..

చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1999–2000లో చదువుకున్న పదో తరగతి బ్యాచ్ విద్యార్థులంతా ఒక చోట కలుసుకుని సరదాగా గడిపారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డ వారంతా ఒకరినొకరు ఆత్మీయంగా పలుకరించుకున్నారు. అనంతరం అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు.

35యేళ్ల తర్వాత..

గజ్వేల్‌రూరల్: వాట్సాప్ గ్రూపు వేదికగా 35 యేళ్ల తర్వాత కలుసుకొన్న పూర్వవిద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 1989–91లో ఇంటర్మీడియెట్ చదువుకున్న వారంతా ఆదివారంగజ్వేల్‌లోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాంచందర్, నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాకలో..

దుబ్బాకరూరల్: మండలంలోని ఆకారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–2006 పదో తరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆత్మీయంగా పలకరించుకొన్నారు. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.



గజ్వేల్‌రూరల్: గజ్వేల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో 1989-91 బ్యాచ్ ఇంటర్ విద్యార్థులు



దుబ్బాకరూరల్: ఆకారం ఉన్నత పాఠశాలలో..



మిరుదొడ్డి(దుబ్బాక): పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మిరుదొడ్డిలో..

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని అల్వాల–చెప్యాల క్రాస్‌రోడ్డులో ఉన్న టీజీడబ్ల్యూఆర్ఎస్‌లో 2006–07 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థినులు ఘనంగా ఆత్మీయ సమ్మేళనం జరుపుకొన్నారు. 18 యేళ్ల తర్వాత కలుసుకున్న వారంతా తాము చదువుకున్న పాఠశాలలోని జ్ఞాపకాలను గుర్తుతెచ్చుకున్నారు.

దొంగల బీభత్సం

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండలం రామవరం గ్రామంలో శనివారం అర్ధరాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన వంగపల్లి భరత్, రాజిరెడ్డి, అమలకొండ సంపత్, ఎడమల భాస్కర్‌రెడ్డికి చెందిన సుమారు మూడు సౌండ్ బాక్స్‌లు గాంధీ చౌరస్తాలో దొంగతనానికి గురయ్యాయి. అలాగే పొన్న కరుణాకర్‌కు చెందిన బైకుల్లో 2 లీటర్ల పెట్రోల్ చోరీకి పాల్పడినట్లు వారు పేర్కొన్నారు. గ్రామంలోని గాంధీ చౌరస్తా, సెల్ టవర్ వద్ద దొంగతనానికి గురైనట్లు చెబుతున్నారు. రాత్రి పూట పోలీసులు ప్రతిరోజూ గస్తీ నిర్వహించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఉచితంగా 'కలరిపయట్టు' శిక్షణ

సంగారెడ్డి టౌన్: సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలోని శ్రీజ్యోతిర్వాస్తు విద్యాపీఠంలో కలరిపయట్టు శిక్షణ 15 రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు వ్యవస్థాపకులు డాక్టర్ మహేశ్వర శర్మ సిద్ధాంతి తెలిపారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏప్రిల్ 24న ప్రారంభమైన శిక్షణ మే 9వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. కేరళ ప్రాచీన క్రీడ కలరిపయట్టు విద్యార్థులకు ఎంతో ఉపయోగంగా ఉంటుందన్నారు. ఈ ప్రాంతంలో మొదటిసారిగా కలరిపయట్టు శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు తెలిపారు. 131 మంది విద్యార్థులు శిక్షణకు హాజరవుతున్నారని చెప్పారు.